

# విభారె
## తెలుగు దినపత్రిక
## VIBHARE TELUGU DAILY






PUBLISHED FROM KURNOOL ఎడిటర్: ఆవుల విజయ భాస్కర రెడ్డి మంగళవారం 14-04-2026 సంపుటి: 07 సంచిక 314 పేజీలు: 8 వెల: రూ 3-00

# 21వ శతాబ్దం మహిళలదే.. కొత్త చరిత్రను లిఖించనున్నాం: మోదీ



న్యూఢిల్లీ: మహిళా రిజర్వేషన్ చట్టంతో ముడిపడిన సవరణ బిల్లు పార్లమెంటు ప్రత్యేక సమావేశాల ముందుకు వస్తోందని, రిజర్వేషన్ బిల్లు మహిళలకు సముచిత స్థానం కల్పించనుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. 21వ శతాబ్దంలో అతి కీలకమైన నిర్ణయం తీసుకోబోతున్నామని, పార్లమెంటు కొత్త చరిత్రను లిఖించేందుకు చేరువలో ఉందని చెప్పారు. ఢిల్లీలో సోమవారంనాడు నిర్వహించిన 'నారీ శక్తి వందన్ సమ్మేళన్' కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రధాని మాట్లాడారుపాలనలో మహిళల భాగస్వామ్యానికి పెద్దపీట వేయడం ద్వారా దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న నిరీక్షణకు పార్లమెంటు ప్రత్యేక సమావేశాలతో తెరపడనుందని మోదీ ప్రకటించారు. కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయం మహిళలకు అంకితమని అన్నారు. 21వ శతాబ్దం మహిళలదేనని, మహిళా రిజర్వేషన్ చట్టం అమలుతో చిరకాల స్వప్నాల సాకారంతో పాటు భవిష్యత్ సంకల్పాలు నెరవేరుతాయని అన్నారు. సామాజిక న్యాయం కేవలం పురుషుల వల్ల మాత్రమే కాదని, భారత ప్రజాస్వామ్యాన్ని మహిళలు మరింత బలోపేతం చేస్తారని అన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లుతో లింగ సమానత్వం, సామాజిక న్యాయం సాకారమవుతుందని పేర్కొన్నారు.'మహిళా సాధికారతా బిల్లును ఎట్టి పరిస్థితుల్లోనూ 2029 నుంచి అమలు చేయాలనే ఏకగ్రీవ డిమాండ్ ఉంది. 2029 గడువును దృష్టిలో ఉంచుని దీనిపై సమగ్ర చర్చను ఏప్రిల్ 16 నుంచి పార్లమెంటులో చేపట్టనున్నాం' అని మోదీ తెలిపారు. పరస్పర సహకారం, పార్టిసిపేషన్‌తో ఈ పని నిర్వహించాలని తమ అభిమతమని, ఈసారి కూడా ప్రతి ఒక్కరి సమష్టి కృషితో సభాగౌరవం సమున్నత శిఖరాలకు చేరుకోబోతుందని అన్నారు. ఈనెల 16 నుంచి 18వ తేదీ వరకూ మూడు రోజుల పాటు మహిళా రిజర్వేషన్ బిల్లుతో ముడిపడిన సవరణలపై చర్చించేందుకు పార్లమెంటు ప్రత్యేకంగా సమావేశమవుతోంది. 20029 నుంచి లోక్‌సభ, శాననసభ ఎన్నికలను కచ్చితంగా మహిళా రిజర్వేషన్లతో నిర్వహించుకుందామని ప్రధాని ఇప్పటికే పిలుపునిచ్చారు. ఇందుకోసం రాజకీయ పార్టీలన్నీ ఏకతాటిపైకి వచ్చి సవరణ బిల్లులను ఆమోదించాలని వివిధ పార్టీల లోక్‌సభ, రాజ్యసభాపక్ష నాయకులకు మోదీ లేఖ రాశారు. దేశ మహిళల అభ్యున్నతి కోసం ప్రత్యేక పార్లమెంటు సమావేశంలో ఎంపీలంతా ఏకమై మాట్లాడాలని, చరిత్రాత్మక మార్పునకు నాంది పలకాలని ఆ లేఖలో కోరారు.

# రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలిసిన మంత్రి లోకేశ్, ఏన్డీయే ఎంపీలు..



ఢిల్లీ: రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ భేటీ అయ్యారు. ఎన్డీయే ఎంపీలతో కలిసి ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. అమరావతిని ఏపీ శాశ్వత రాజధానిగా గుర్తిస్తూ బిల్లుకు ఆమోదం తెలిపినందుకు రాష్ట్రపతికి లోకేశ్, ఎన్డీయే ఎంపీలు కృతజ్ఞతలు తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రజల తరఫునా ధన్యవాదాలు తెలిపారు. ఈ నిర్ణయంతో రాజధాని రైతులు, ఏపీ ప్రజలంతా సంతోషంగా ఉన్నారని ఆమెకు వివరించారు. ఈ సందర్భంగా లోకేశ్, ఎంపీలతో ముచ్చటించారు ద్రౌపది ముర్ము. ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబుపై ప్రశంసలు కురిపించారు. చంద్రబాబు ఇంటెలిజెంట్, విజనరీ లీడర్ అంటూ మెచ్చుకున్నారు. అమరావతి నిర్మాణానికి రైతులు 33 వేల ఎకరాలు ఇవ్వడం నిజంగా హర్షణీయమన్నారు ద్రౌపది ముర్ము. అందుకు కృషి చేసిన చంద్రబాబు గ్రేట్ అన్నారు. కాగా, రాష్ట్రపతిని కలిసేందుకు మంత్రి నారా లోకేశ్ బృందం ఆదివారం సాయంత్రమే ఢిల్లీకి చేరుకున్నారు. నేడు ఆమెతో మర్యాదపూర్వక భేటీ నిర్వహించారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో భేటీ అనంతరం టీడీపీ ఎంపీ అప్పలనాయుడు మీడియాతో మాట్లాడారు. అమరావతి బిల్లుకు ఆమోదం తెలపడంపై రాష్ట్రపతికి కృతజ్ఞతలు తెలిపినట్లు చెప్పారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబుని రాష్ట్రపతి ప్రశంసించారని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పరిపాలన గురించి అందరూ మాట్లాడడం సంతోషంగా ఉందన్నారు. ఈ విషయంలో దేశమంతా ఒకవైపు ఉంటే వైసీపీ మాత్రం మరోవైపు ఉందన్నారు అప్పలనాయుడు. ఆ పార్టీ నేతలు మాత్రమే అమరావతిలో అవినీతి జరుగుతోందని విమర్శించడం విడ్డూరంగా ఉందన్నారు. రాష్ట్ర ప్రజలను తప్పుదోవ పట్టించే విధంగా ఫ్యాన్ పార్టీ వ్యవహరిస్తోందని మండిపడ్డారు. రైతుల త్యాగాలకు అనుగుణంగా రాజధాని బిల్లుకు ఆమోదం లభించిందని.. వైసీపీ నేతలు ఐదు కోట్ల ఆంధ్రులను అవమానిస్తున్నారని ఆగ్రహించారు. మావిగన్ పేరుతో ప్రజలను జగన్ మోహన్ రెడ్డి మభ్యపెడుతున్నారని ఎంపీ అప్పలనాయుడు ఆరోపించారు.

# లాలూకు సుప్రీంలో చుక్కెదురు...

### వ్యక్తిగత హాజరు నుంచి మాత్రం మినహాయింపు



న్యూఢిల్లీ: భూములు తీసుకుని ఉద్యోగాలు ఇచ్చారనే కేసులో ఆర్జేడీ చీఫ్ లాలూ ప్రసాద్ యాదవ్ కు సుప్రీంకోర్టు లో నిరాశ ఎదురైంది. తనపై, తన కుటుంబ సభ్యులపై సీబీఐ నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలంటూ లాలూ వేసిన పిటిషన్‌ను అత్యున్నత న్యాయస్థానం సోమవారంనాడు తోసిపుచ్చింది. జస్టిస్ ఎంఎం సుందరేశ్, జస్టిస్ ఎన్.కోటేశ్వర సింగ్‌తో కూడిన ధర్మాసనం ఈ మేరకు తీర్పునిచ్చింది. కేసులో మెరిట్స్‌ను పరిశీలించే అధికారాన్ని ట్రయిల్ కోర్టుకే విడిచిపెడుతూ, చట్టప్రకారం విచారణ కొనసాగించవచ్చని ధర్మాసనం పేర్కొంది. అయితే ట్రయల్ కోర్టు విచారణకు వ్యక్తిగత హాజరు నుంచి లాలూకు మినహాయింపు ఇచ్చింది. ఈకేసులో ఇంతకుముందు లాలూ ప్రసాద్‌కు హైకోర్టులో ఎదురుదెబ్బ తలిగింది. సీబీఐ తమపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలంటూ లాలూ వేసిన పిటిషన్‌ను హైకోర్టు తోసిపుచ్చింది. పిటిషన్‌లో ఎలాంటి మెరిట్ లేదని కోర్టు పేర్కొంది. ఈ నిర్ణయాన్ని లాలూ సుప్రీంకోర్టులో సవాలు చేశారు. దీనిపైనే సుప్రీం తాజా తీర్పు చెప్పింది. లాలూ ప్రసాద్ యాదవ్ 2004-2009 మధ్య కేంద్ర రైల్వే మంత్రిగా ఉన్నప్పుడు ఉద్యోగాల కేటాయింపులో అవినీతి ఆరోపణలు వచ్చాయి. ఆ సమయంలో రైల్వేలోని వివిధ జోన్లలో అనేక మందిని గ్రూప్-డి పోస్టుల్లో నియమించారు. దీనికి బదులుగా వారి భూములను లాలూ ప్రసాద్ కుటుంబ సభ్యులతో పాటు ఒక ప్రైవేటు కంపెనీకి బదిలీ చేశారని సీబీఐ ఆరోపణగా ఉంది. 2022 మే 18న లాలూ, ఆయన భార్య, ఇద్దరు కుమార్తెలు, గుర్తుతెలియని ప్రభుత్వ అధికారులు, ప్రైవేటు వ్యక్తులపై కేసు నమోదైంది. 77 ఏళ్ల లాలూ, ఇతర నిందితులు ప్రస్తుతం బెయిలుపై ఉన్నారు. కాగా, సీబీఐ తనపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్, ఇన్వెస్టిగేషన్, చార్జిషీట్లలో చట్టపరమైన లోపాలున్నాయని లాలూ వాదనగా ఉంది. ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 17ఏ కింద సీబీఐ ముందస్తు అనుమతి తీసుకోలేదని, ఇందువల్ల సీబీఐ ప్రొసీడింగ్స్ చెల్లనేరవని లాలూ వాదించారు. అయితే ఈ వాదనను తాజాగా సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. దీంతో ఈ కేసులో లాలూ కుటుంబానికి న్యాయపరంగా మరిన్ని చిక్కులు తప్పేలాలేవు.

## హిందూ దళిత సోదరులను మోసం చేయకండి: రఘురామ

పశ్చిమ గోదావరి, ఏప్రిల్ 13: కొంతమంది మతమార్పిడి విషయంలో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఏపీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు అన్నారు. మత మార్పిడి జరిగితే 5 ఏళ్లు జైలు శిక్ష తప్పదని ఆయన హెచ్చరించారు. సోమవారం మత మార్పిళ్లపై రఘురామ మీడియాతో మాట్లాడుతూ.. 'సుప్రీంకోర్టు క్లియర్‌గా చెప్పింది.. ఆర్టికల్ 25 మతం మారే స్వేచ్ఛ ఇచ్చింది. మతతత్వాన్ని మార్చే అధికారం రాజ్యాంగానికి లేదు. దయచేసి హిందూ దళిత సోదరులను మోసం చేయకండి. క్రిస్టియన్‌లకు ఎస్సీ, ఎస్టీ కేసు పెట్టే హక్కు లేదు' అని అన్నారు. కాగా, గత నెలలో పశ్చిమ గోదావరి జిల్లా ఆకివీడులోని పెదపేటలో శిథిలావస్థకు చేరిన రామాలయంలో శ్రీరామనవమి పూజలు నిర్వహించేందుకు వెళ్లిన రఘురామకృష్ణరాజుతో పాటు జనసేన నాయకులపైనా కత్తులు, మేకులతో ఆందోళనకారులు దాడి చేశారు. దళితుల ముసుగులో క్రైస్తవులు తమపై దాడికి దిగారని రఘురామ ఆరోపించారు.

# కేంద్ర ప్రతిపాదిత డీ-రెగ్యులేషన్ ఫేజ్-2 విధానాలపై సీఎం చంద్రబాబు సమీక్ష



అమరావతి,స్టీల్ సెక్రటరీ సందీప్ పౌండ్రిక్ నేతృత్వంలోని కేంద్ర ప్రతినిధి బృందంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమీక్ష నిర్వహించారు. కేంద్ర ప్రతిపాదిత డీ-రెగ్యులేషన్ ఫేజ్-2 విధానాలపై సీఎం సమీక్ష జరిపారు. పరిశ్రమల ఏర్పాటులో వేగం... అనుమతుల్లో సులభతరం... అనవసరపు పర్మిషన్ల నియంత్రణపై చర్చ జరిగింది. కేంద్రం రూపొందించిన స్టీల్ సెక్రటరీ సందీప్ పౌండ్రిక్ ప్రతిపాదనలను సీఎం ముందు ఉంచారు. స్టీల్ సెక్రటరీ ప్రతిపాదనలపై రాష్ట్రానికి చెందిన వివిధ శాఖల ఉన్నతాధికారులతోనూ సీఎం సమీక్ష జరిపారు. 800కు పైగా ఉన్న నిబంధనలను 100లోపునకు తీసుకురావాలని సీఎస్ సహా వివిధ శాఖల ఉన్నతాధికారులకు ముఖ్యమంత్రి ఆదేశించారు. పర్మిషన్లు, లైసెన్సులను సింగిల్ డిజిట్కు పరిమితం చేయాలని సీఎం సూచించారు. ?(ఎ జల భద్రత, పర్యావరణం వంటి అంశాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తల విషయంలో రాజీ పడకూడదని స్పష్టం చేసారు. వేధింపులు లేకుండా థర్డ్ పార్టీ తనిఖీలకు ప్రాధాన్యమివ్వాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. అటవీ చట్టాలను వీలైనంత మేరకు సరళీకరించాలని కేంద్ర బృందానికి సీఎం సూచించారు. ఫైర్ సేఫ్టీకి సంబంధించి నేషనల్ బిల్డింగ్ కోడ్ స్థానంలో రాష్ట్ర నిబంధనలు పెట్టాలి. డబుల్ లైసెన్సింగ్ తరహా పద్ధతులను తప్పించాలి. ఒకసారి రిజిస్ట్రేషన్ చేసుకుంటే జీవిత కాలం చెల్లుబాటు కావాలని సూచించారు. పరిశ్రమలకు అనుమతులు, నిబంధనలను సడలించే విషయంలో తమ ప్రతిపాదనలకంటే రాష్ట్రం చాలా ముందుందని కేంద్ర స్టీల్ సెక్రటరీ సందీప్ పౌండ్రిక్ వెల్లడించారు. తాము ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ స్థానంలో స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానాన్ని అమలు చేస్తున్నామని కేంద్ర బృందానికి సీఎం వివరించారు. ప్రజలకు సేవలు అందించడం కోసం స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్స్ విధానాన్ని అవలంభిస్తున్నట్టు సీఎం వెల్లడించారు.

## హమ్ సఫర్ ఎక్స్‌ప్రెస్ రైలును ప్రారంభించిన కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు

శ్రీకాకుళం, ఏప్రిల్ 13: శ్రీకాకుళం జిల్లావాసుల ఎన్నో ఏళ్ల కల నెరవేరింది. శ్రీకాకుళం నుంచి తిరుపతికి నేరుగా మొదటి రెగ్యులర్ రైలు ప్రారంభమైది. హమ్ సఫర్ ఎక్స్‌ప్రెస్ రైలును కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు ప్రారంభించారు. రూ.35 కోట్లతో శ్రీకాకుళం రైల్వేస్టేషన్ అభివృద్ధి చేశామని రామ్మోహన్ నాయుడు అన్నారు. శ్రీకాకుళం ప్రజల దీర్ఘకాలిక కోరిక నెరవేరిందంటూ ఆయన ఆనందం వ్యక్తం చేశారు. 75 ఏళ్ల జిల్లా చరిత్రలో తొలిసారిగా శ్రీకాకుళం నుంచి తిరుపతికి నేరుగా రెగ్యులర్ రైలు సర్వీస్ ప్రారంభమైందని తెలిపారు. త్వరలో మూలపేట గ్రీన్‌ఫీల్డ్ పోర్టు పూర్తవుతుందని తెలిపారు. ఇక హమ్ సఫర్ ఎక్స్‌ప్రెస్ రైలు శ్రీకాకుళం రోడ్ నుంచి ప్రతి సోమవారం, తిరుపతి నుంచి ప్రతి ఆదివారం అందుబాటులో ఉంటుంది. గతంలో.. కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు చొరవ తీసుకుని శ్రీకాకుళం నుంచి తిరుపతికి రైలు నడపాలని రైల్వేమంత్రి అశ్విని వైష్ణవ్‌ని కోరారు. వెంటనే స్పందించిన రైల్వేమంత్రి ఈ ప్రతిపాదనలపై అధికారులకు ఆదేశాలు ఇవ్వడంతో రెగ్యులర్ రైలును మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈక్రమంలో తాజాగా శ్రీకాకుళం రోడ్ రైల్వేస్టేషన్ నుంచి తిరుపతికి రైలు నంబర్ 17439/40 హమ్ సఫర్ ఎక్స్‌ప్రెస్ ప్రారంభమైంది.




# సంపాదకీయం

మంగళవారం 14-04-2026

## పొంచి ఉన్న ఆయిల్ సంక్షోభం...

అమెరికా–ఇరాన్ మధ్య చర్చలు విఫలమయ్యాయి. 21 గంటలపాటు జరిగిన చర్చల్లో ఇరుదేశాల మధ్య ఎలాంటి ఒప్పందం కుదరలేదు. దీంతో రానున్న రోజుల్లో ఎలాంటి పరిణామాలకు దారి తీస్తుందోనన్న ఆందోళనలు నెలకొన్నాయి. పశ్చిమాసియాలో మరోసారి యుద్ధ జ్వాలలు తప్పవా..! ప్రపంచవ్యాప్తంగా ఇంధన సంక్షోభం తప్పదా..! నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతాయా..! అమెరికా– ఇరాన్ మధ్య చర్చల విఫలం ఎలాంటి పరిణామాలకు దారి తీయనుంది..అమెరికా–ఇరాన్ మధ్య చర్చలు విఫలమైన నేపథ్యంలో ప్రస్తుతం కుదిరిన రెండు వారాల తాత్కాలిక విరమణ ఒప్పందం ముగిసిపోయే అవకాశాలు కన్పిస్తున్నాయి. దీంతో ఇరాన్‌పై అమెరికా–ఇజ్రాయెల్ తీవ్రస్థాయిలో విరుచుకుపడే అవకాశం ఉంది. ఇరాన్‌లోని చమురు కేంద్రాలతో పాటు.. పౌర మౌలిక సదుపాయాలపైనా దాడులకు అవకాశం ఉంది. ఒప్పందం కుదరకపోతే భీకర దాడులు చేస్తామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇప్పటికే పలుమార్లు హెచ్చరికలు చేశారు. తాజా పరిణామాల నేపథ్యంలో ఆయన ఎలాంటి నిర్ణయం తీసుకుంటారనే దానిపై భయాందోళనలు నెలకొన్నాయి.అమెరికా– ఇరాన్ దాడులకు ఇరాన్ కూడా అంతే గట్టిగా ప్రతిఘటిస్తుంది. ఇజ్రాయెల్‌తో పాటు పశ్చిమాసియాలోని చమురు క్షేత్రాలను లక్ష్యంగా చేసుకోవచ్చు. అదే జరిగితే.. సౌదీ, యూఏఈ, బహ్రెయిన్, కువైట్ తదితర దేశాలు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. ఇరాన్ దాడుల్లో పశ్చిమాసియాలోని అమెరికా స్థావరాలకు కూడా ముప్పు పొంచి ఉంది. ఈ యుద్ధం లెబనాన్, సిరియాలకు కూడా విస్తరించే అవకాశం లేకపోలేదు. టెహ్రాన్‌కు మద్దతుగా హూతీలు, హెజ్‌బొల్లాలు తమ కార్యకలాపాలను తీవ్రతరం చేస్తాయి. హర్మూజ్ జలసంధిపై ఇరాన్ తన పట్టుబిగిస్తుంది. దీన్ని శాశ్వతంగా మూసివేస్తుంది. దీంతో ప్రపంచవ్యాప్తంగా చమురు సంక్షోభం నెలకొనే ప్రమాదం ఉంది. పెట్రోల్, డీజిల్ ధరలు ఊహించని స్థాయికి చేరుకోవచ్చు. అనేక దేశాల్లో నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటే ప్రమాదం ఉంది. ఈ పరిణామాలు ఆర్థిక మాంద్యానికి కారణం కావొచ్చు.ఇరాన్ తన అణు కార్యక్రమాన్ని మరింత వేగవంతం చేయొచ్చు. ఇప్పటివరకు పౌర అవసరాల కోసం మాత్రమే యురేనియంను శుద్ధి చేస్తున్నట్లు ఆ దేశం చెప్పుకొచ్చింది. ఈ ఉత్కంఠభరిత పరిస్థితుల మధ్య, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన 'ట్రూత్ సోషల్' ఖాతాలో షేర్ చేసిన ఒక వార్తా కథనం ఇప్పుడు అంతర్జాతీయ వేదికపై పెను చర్చకు దారితీసింది. తమ నిబంధనలకు టెహ్రాన్ లొంగని పక్షంలో, ఇరాన్ నౌకలను సముద్ర మార్గంలోనే అడ్డుకునే 'నౌకాదళ దిగ్బంధనం' అస్త్రాన్ని ప్రయోగించే అవకాశం ఉందని ఆ కథనం పేర్కొందిఒకవేళ ఈ ప్లాన్ అమలైతే, ఇరాన్ నౌకలు రేవుల నుంచి ముందుకు వెళ్ళలేవు. దీనివల్ల ఆ దేశానికి ప్రధాన ఆదాయ వనరుగా ఉన్న చమురు ఎగుమతులు పూర్తిగా ఆగిపోయి, ఆర్థిక వ్యవస్థ కుప్పకూలే ప్రమాదం ఉంది. కేవలం ఇరాన్‌కే కాకుండా, ఆ దేశం నుండి పెద్ద ఎత్తున చమురును కొనుగోలు చేసే భారత్, చైనా వంటి దేశాలపై కూడా దీని ప్రభావం తీవ్రంగా ఉంటుంది.గతంలో వెనిజులా మాజీ అధ్యక్షుడు మదురోను లొంగదీసుకోవడానికి అమెరికా ఇదే విధమైన నౌకాదళ దిగ్బంధనాన్ని అమలు చేసి విజయం సాధించింది. అదే తరహా వ్యూహాన్ని ఇప్పుడు ఇరాన్‌పై కూడా ట్రంప్ అమలు చేసే అవకాశం ఉందని అంతర్జాతీయ మీడియా అంచనా వేస్తోంది.పాకిస్థాన్ వేదికగా ఇరాన్‌తో జరిగిన చర్చలు విఫలమైనట్లు అధికారికంగా ప్రకటించిన కొద్ది గంటల్లోనే ట్రంప్ ఈ పోస్ట్ చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఇది కేవలం మీడియా కథనం మాత్రమేనా లేక అమెరికా తదుపరి కార్యాచరణకు ఇది పరోక్ష సంకేతమా అని విశ్లేషకులు భావిస్తున్నారు. ట్రంప్ తన పోస్ట్ ద్వారా ఇరాన్‌కు స్పష్టమైన హెచ్చరికలు పంపినట్లు తెలుస్తోంది.తాజా పరిణామాలతో అణుబాంబు తయారీ దిశగా అది అడుగులు వేయొచ్చు. ఆరోపణలపై ట్రంప్ తీవ్రంగా స్పందించారు. చైనా ఇరాన్‌కు ఆయుధాలు పంపడం మానుకోవాలని, లేకపోతే బీజింగ్‌కు 'వినాశకర పరిణామాలు' తప్పవని హెచ్చరించారు. అమెరికాతో వాణిజ్య యుద్ధంలో చైనాకు 200% టారిఫ్‌లు విధించే అవకాశం ఉందని గతంలోనే ప్రకటించిన ట్రంప్, ఈసారి మరింత కఠినంగా మాట్లాడారు. 'మాకు నాటో నుంచి ఎటువంటి సాయం లభించలేదు. అయినా ఇరాన్‌ను సైనికపరంగా ఓడించాం. చర్చలు విఫలమైనా అంతిమ విజయం మాదే,' అని ట్రంప్ పేర్కొన్నారు. హర్మూజ్ జలసంధిని 48 గంటల్లోగా తిరిగి తెరవకపోతే, ఇరాన్ విద్యుత్ కేంద్రాలను 'తుడిచిపెట్టేస్తామని' ఆయన బహిరంగంగా హెచ్చరించారు.వాషింగ్టన్‌లోని చైనా రాయబార కార్యాలయం ఈ ఆరోపణలను ఖండించింది. యుద్ధం మొదలైనప్పటి నుంచి ఏ పక్షానికి ఎటువంటి ఆయుధాలు సరఫరా చేయలేదని పేర్కొంది. అయితే, ఇరాన్ అధికారికంగా చైనా ఆయుధాలు అందినట్లు వెల్లడించకపోయినా, తమ వద్ద ఉన్న ఆధునిక వ్యవస్థల సామర్థ్యాన్ని బట్టి చూస్తే చైనా సాయం స్పష్టంగా కనిపిస్తోందని అంతర్జాతీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. చైనాకు ఇరాన్ నుంచి రోజుకు 20 లక్షల బ్యారెళ్ల ముడిచమురు సరఫరా అవుతోంది. ఈ ఆర్థిక బంధమే చైనా ఇరాన్‌కు రహస్య సాయం చేయడానికి ప్రధాన కారణంగా కనిపిస్తోంది.ఈ పరిణామాలు మధ్యప్రాచ్యంలో కొత్త శక్తి సమీకరణాలకు దారితీస్తున్నాయి. చైనా?ఇరాన్ బంధం మరింత బలపడటం, ఆర్థిక, సైనిక సహకారం పెరగడం వల్ల అమెరికాకు ఇది సవాల్‌గా మారింది.

## పోలింగ్ స్టేషన్లలో ఫింగర్, బయోమెట్రిక్ వినియోగంపై పిల్.. ఈసీ, కేంద్రానికి సుప్రీం నోటీసులు



న్యూ ఢిల్లీ, ఎన్నికల సందర్భంగా పోలింగ్ కేంద్రాల్లో ఫింగర్ ప్రింట్, బయోమెట్రిక్ ఉపయోగించాలంటూ ఒక ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలైంది. దొంగ ఓట్లను అడ్డుకునేందుకు వీటిని వినియోగించేలా చూడాలంటూ బీజేపీ నేత, లాయర్ అశ్విని కుమార్ ఉపాధ్యాయ్ సుప్రీం కోర్టులో ఈ పిల్ దాఖలు చేశారు. దీన్ని విచారణకు స్వీకరించిన కోర్టు తాజాగా కేంద్ర ఎన్నికల సంఘానికి (ఈసీ), కేంద్రానికి, రాష్ట్రాలకు నోటీసులు జారీ చేసింది. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చి ఆధ్వర్యంలోని సుప్రీం కోర్టు ధర్మాసనం సోమవారం ఈ అంశంపై విచారణ జరిపింది.ఈసీకి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు జారీ చేసింది. అయితే, ఈ అంశాన్ని తాజా అసెంబ్లీ ఎన్నికలకు అనుగుణంగా విచారణకు పరిగణించలేమని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. ఈ కేసులో చెప్పబోయే తీర్పు రాబోయే పార్లమెంట్ ఎన్నికలు, అసెంబ్లీ ఎన్నికల నుంచి వర్తించవచ్చని కోర్టు తెలిపింది. ఈ పిల్ విచారణ సందర్భంగా కోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ అంశంపై ఎన్నికల సంఘాన్నే సంప్రదించాలని పిటిషనర్‌కు మొదట సూచించింది. అయితే, దీన్ని ఈ ఎన్నికల కోసం పరిశీలించాల్సిన అవసరం లేదని పిటిషనర్ కోర్టుకు తెలిపారు. దీంతో ఈ కేసును కోర్టు విచారణకు స్వీకరించింది. అలాగే, రాబోయే పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికలకు కూడా ఈ ప్రోటోకాల్ వర్తిస్తుందా లేదా అనేది కూడా పరిశీలిస్తామని కోర్టు వివరించింది. ప్రస్తుతం తమిళనాడు, కేరళ, అస్సాం, పశ్చిమ బెంగాల్ సహా కేంద్ర పాలిత ప్రాంతమైన పుదుచ్చేరిలో అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్న సంగతి తెలిసిందే.అందుకే, ఈ ఎన్నికల కోసం కాకుండా భవిష్యత్ ఎన్నికల కోసం ఈ పిల్‌ను పరిశీలిస్తున్నట్లు కోర్టు తెలిపింది. ఇక.. ప్రతి ఎన్నికల్లో దొంగ ఓట్ల అంశం తెరమీదకు వస్తున్న సంగతి తెలిసిందే. ఏదో ఒక గుర్తింపు కార్డు ఆధారంగా ఓటర్లకు ఓటు వేసు అవకాశం కల్పిస్తున్నారు. దీని బదులు ఆధార్‌తో అనుసంధానమై ఉన్న ఫింగర్ ప్రింట్స్, ఐరిస్ బయోమెట్రిక్ ఆధారంగా ఓటు వేసే అవకాశం కల్పించాలని, దీనివల్ల దొంగ ఓట్లను నివారించవచ్చని పలువురు రాజకీయవేత్తలు ఎప్పటినుంచో అంటున్నారు.

## 'చల్లూరు గుట్టల్లో అక్రమ మైనింగ్‌పై చర్యలు తీసుకోవాలి'

### బీఆర్ఎస్ రాజాపేట మండలాధ్యక్షుడు సట్టు తిరుమలేష్

రాజాపేట, ఏప్రిల్ 13 : రాజాపేట మండలం చల్లూరు గుట్టల్లో ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా కొనసాగుతున్న మైనింగ్ దందాపై చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సట్టు తిరుమలేష్ డిమాండ్ చేశారు. సోమవారం రాజాపేట మండలంలోని చల్లూరు గుట్టల్లో 322 సర్వే నెంబర్లలో కొనసాగుతున్న అక్రమ మైనింగ్ పై చర్యలు తీసుకోవాలని స్థానిక తాసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా తాసీల్దార్ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేశారు. ఎలాంటి పర్యావరణ అనుమతులు లేకుండానే పకృతి సంపదని కొల్లగొడుతూ కోట్లు దండుకుంటున్నారని ఆరోపించారు. రేయింబవళ్లు అక్రమ బ్లాస్టింగ్ పెద్ద ఎత్తున ఎగిసిపడుతున్న చప్పుళ్లకు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకుని గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ అక్రమ మైనింగ్ దందా వెనక ఇంత పెద్దోళ్లు ఉన్నా విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అదే విధంగా గతంలో కూడా చల్లూరు మల్బవాని చెరువులో ఇలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా మట్టిని తరలించి కోట్ల రూపాయల సొమ్ము చేసుకున్నారని, ఈ విషయంపై పలుమార్లు విన్నవించుకున్న పట్టించుకునే నాధుడే కరువయ్యాడని ఆవేదన వ్యక్తం చేశారు. అక్రమ మైనింగ్ పై చర్యలు తీసుకోకపోతే పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్టు హెచ్చరించారు.



## రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా విస్తృత అవగాహన సదస్సులు

### జిల్లా కలెక్టర్ అంకిత్

భద్రాద్రి బ్యూరో , ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా నిర్వహిస్తున్న రోడ్డు భద్రత వారోత్సవాల సందర్భంగా జిల్లా వ్యాప్తంగా రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు. ఈ కార్యక్రమాలలో భాగంగా సోమవారం విద్యానగర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన గ్రామసభకు కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మార్చి 6 నుండి ప్రారంభమైన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో ప్రతి వారం వివిధ అంశాలపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగా పారిశుద్ధ్య కార్యక్రమాలు, హెల్త్ క్యాంపులు నిర్వహించడంతో పాటు డీ–అడిక్షన్, కౌన్సిలింగ్ సేవలను కూడా అందుబాటులోకి తీసుకువచ్చామని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీలలో గ్రామసభలు నిర్వహిస్తూ ప్రజలను ప్రత్యక్షంగా భాగస్వాములుగా చేసుకుంటూ అవగాహన కల్పిస్తున్నామన్నారు . రోడ్డు ప్రమాదాల వల్ల ప్రతి రోజు అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేస్తూ, రోడ్డు ప్రమాదాలు రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరిలో బాధ్యతాయుతమైన ప్రవర్తన అవసరమని అన్నారు. ఈ గ్రామసభల ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చి ప్రమాదాలను తగ్గించడం ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రమాదాలకు కారణమయ్యే బ్లాక్ స్పాట్లను గుర్తించడం, రహదారుల వెంట ఉన్న పిచ్చి మొక్కలను తొలగించడం, ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవడం వంటి చర్యలు చేపడుతున్నామని చెప్పారు. అలాగే ప్రమాదాల సమయంలో అంబులెన్స్ సేవలు సమయానికి అందుబాటులో ఉన్నాయా, సమీప ఆసుపత్రులకు కనెక్టివిటీ ఎలా ఉందనే అంశాలను కూడా ఈ గ్రామసభల ద్వారా సమీక్షిస్తున్నామని వివరించారు. పాఠశాల విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించడం ద్వారా వారు తమ తల్లిదండ్రులకు హెల్మెట్, సీట్ బెల్ట్ ప్రాముఖ్యతను తెలియజేసేలా చేయాలని సూచించారు. ఇది ఏ ఒక్క శాఖకు సంబంధించిన విషయం కాదని, అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసినప్పుడే ప్రమాద రహిత జిల్లాను సాధించగలమని అన్నారు. కొన్ని జిల్లాలో అమలు చేస్తున్న "నో హెల్మెట్ ? నో ఎంట్రీ" వంటి వినూత్న చర్యలు మంచి ఫలితాలు ఇస్తున్నాయని, అలాంటి ఆలోచనలను మన జిల్లాలో కూడా అనుసరించాలని సూచించారు. అతివేగం, డ్రంక్ అండ్ డ్రైవ్, హెల్మెట్ ధరించకపోవడం, సీట్ బెల్ట్ వినియోగం లేకపోవడం వంటి కారణాల వల్లే ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయని , వీటిపై విస్తృతంగా అవగాహన కల్పించి ప్రమాదాలను నివారించాలని పిలుపునిచ్చారు. అన్ని శాఖలు సమన్వయంతో ఈ రోడ్డు భద్రత వారోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. అనంతరం గ్రామస్థులతో కలిసి రోడ్డు భద్రత ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో విద్యానగర్ సర్పంచ్ భూక్య శాంతి శ్రీ, ఉపసర్పంచ్ వాసిరెడ్డి మురళి, తహసిల్దార్ నాగరాజు, పంచాయతీ ఈవో వెంకటేశ్వర్లు, రవాణా, పోలీస్ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే కొలకపూడి కి ఎంపి చిన్ని వర్గం వార్నింగ్

తిరువూరు,టీడీపీ ఎమ్మెల్యే కొలికపూడికి సొంత పార్టీ ఎంపీ కేశినేని చిన్ని వర్గం వార్నింగ్ ఇచ్చింది. టీడీపీ తిరువూరు నియోజకవర్గ మాజీ ఇంచార్జ్ దేవదత్ మీడియాతో మాట్లాడారు. బెల్టు షాపులు అడ్డుకోడానికి నువ్వు ఎవడివి. బెల్ట్ షాపుల్ని నువ్వు అడ్డుకునేది ఏంటి.. 175 నియోజకవర్గాల్లో ఎలా జరిగితే ఇక్కడ కూడా అలాగే జరుగుతుందని అన్నారు. ఎంపీ తన దగ్గర డబ్బులు తీసుకోలేదు. అభివృద్ధి పైన, వ్యక్తిగత విషయాల పైన బహిరంగ చర్చకు సిద్ధమా. ఎమ్మెల్యే అయ్యి ఉండి పార్టీ పరువు తీస్తున్నావు . ఇలాంటి ఒక అసమర్థత ఎమ్మెల్యేని, కులాన్ని వాడుకునే ఎమ్మెల్యేని గెలిపించినందుకు ప్రజలు బాధపడుతున్నారని అన్నారు. నువ్వు ఎందిరా పార్టీని బాగుచేసేది.. నువ్వు నాశనం చేయకుండా ఉంటే చాలు . ఎంపీ నా దగ్గర డబ్బులు తీసుకోలేదు.. నేను నా సమస్యని పరిష్కరించుకోగలను . మా సమస్యని మీ అవకాశం లాగా వాడుకోవద్దని అన్నారు.

## రోడ్డు ప్రమాదాల నివారణ ప్రతి ఒక్కరి బాధ్యత : ఎస్ఐ ఎన్.వెంకన్న



గుర్రంపోడు, ఏప్రిల్ 13 : రోడ్డు ప్రమాదాల నివారణ ప్రతి ఒక్కరి బాధ్యత అని గుర్రంపోడు ఎస్ఐ ఎన్.వెంకన్న అన్నారు. సోమవారం మండలంలోని పాల్వాయి గ్రామంలో ఏర్పాటు చేసిన రోడ్డు ప్రమాదాలపై అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజల్లో చైతన్యం కల్పించే ఉద్దేశంతో "అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా రోడ్డు ప్రమాదాలపై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రోడ్డు ప్రమాదాలు చాలా వరకు నిర్లక్ష్యం, అతివేగం, ట్రాఫిక్ నియమాల పట్ల అవగాహన లోపం వల్లే జరుగుతున్నాయన్నారు. కావునా ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటించాలని, ముఖ్యంగా హెల్మెట్, సీట్ బెల్ట్ వినియోగాన్ని అలవాటు చేసుకోవాలని సూచించారు. యువత అధిక వేగంతో వాహనాలు నడపడం వల్ల ప్రాణ నష్టం జరుగుతోందని, తల్లిదండ్రులు కూడా తమ పిల్లలకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించాలన్నారు.మద్యం సేవించి వాహనాలు నడపడం చట్టరీత్యా శిక్షార్హమని, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదే విధంగా వాహనదారులు తమ వాహన పత్రాలు సక్రమంగా కలిగి ఉండాలని, ట్రిపుల్ రైడింగ్ చేయరాదని, మొబైల్ ఫోన్ ఉపయోగిస్తూ డ్రైవింగ్ చేయకూడదన్నారు. పాఠశాలలు, కళాశాలలో, యువతకు, గ్రామాలలో గ్రామస్థాయి రోడ్డు సేఫ్టీ కమిటీల సహకారంతో రోడ్డు భద్రతపై మరిన్ని అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తాసీల్దార్ ఎన్.కరుణశ్రీ, ఏఓ కంచర్ల మాధవరెడ్డి, హెచ్ఎం విజయలక్ష్మి, స్థానిక సర్పంచ్ బైరెడ్డి సత్యనారాయణ, ఉప సర్పంచ్ మంచికంటి ప్రసాద్, పంచాయితీ కార్యదర్శి సైదులు, స్థానికులు, ఆటో, ఇతర వాహనదారులు పాల్గొన్నారు.

## సిమెంట్ మిక్సర్ వెహికల్‌ను ఢీకొన్న ఈకో వ్యాన్.. 11 మంది మృతి



మహారాష్ట్రలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఎదురుగా వస్తున్న ఒక సిమెంట్ మిక్సర్ వాహనాన్ని ప్రయాణికులతో వెళ్తున్న ఈకో వ్యాన్ ఢీకొన్న ఘటనలో 11 మంది మరణించారు. మరికొందరు గాయపడ్డారు. ఈ ఘటన థానే జిల్లా, కల్యాణ్–ముర్బాద్ నేషనల్ హైవే 61పై, గోవిలి గ్రామ సమీపంలోని రైతా బ్రిడ్జి వద్ద సోమవారం ఉదయం జరిగింది. 10.45 గంటల సమయంలో ఈకో వ్యాన్ కొంతమంది ప్రయాణికులతో కల్యాణ్ నుంచి ముర్బాద్ వెళ్తోంది.ఈ క్రమంలో ఎదురుగా వస్తున్న సిమెంట్ మిక్సర్ వాహనాన్ని వేగంగా ఢీకొంది. ఈ ఘటనలో ఐదుగురు ప్రయాణికులు అక్కడికక్కడే మరణించారు. మిగతా ఆరుగురు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయారు. ఇంకా పలువురు గాయపడ్డారు. ఘటన సమచారం అందుకున్న స్థానికులు, అధికారులు సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రుల్ని సమీపంలోని ఆస్పత్రులకు తరలించారు. వీరిలో కొందరి పరిస్థితి విషమంగా ఉందని అధికారులు తెలిపారు. మృతుల్లో ముగ్గురు మహిళలు, ఎనిమిది మంది పురుషులు ఉన్నారు. వీరిలో ఇద్దరు కాలేజీ విద్యార్థులు కూడా ఉన్నారు. ఘటన జరిగిన ప్రదేశంలో దృశ్యాలు హృదయవిదారకంగా ఉన్నాయి.రెండు వాహనాలు ఒకదానిలోకి ఒకటి చొచ్చుకుపోయాయి. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మరోవైపు గుజరాత్‌లో జరిగిన మరో రోడ్డు ప్రమాదంలో ఏడుగురు మరణించారు. రోడ్డు పక్కన నడుచుకుంటూ వెళ్తున్న యాత్రికులపైకి ఓ ట్రక్కు అదుపుతప్పి దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఏడుగురు అక్కడికక్కడే మరణించారు.

### 'పది' పరీక్ష కేంద్రాల్లో సౌకర్యాల కల్పనపై కలెక్టర్ అంకిత్ తనిఖీ

పాల్వంచ, ఏప్రిల్ 13 : పాల్వంచలోని బోల్లారిగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న పదో తరగతి పరీక్ష కేంద్రాన్ని సోమవారం జిల్లా కలెక్టర్ అంకిత్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షల నిర్వహణను ప్రత్యక్షంగా పరిశీలించి, విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలపై సమగ్రంగా ఆరా తీశారు. తనిఖీలో భాగంగా పరీక్ష హాళ్లలో విద్యార్థులు కూర్చునే విధానం, ప్రశాంత వాతావరణం, తగిన వెలుతురు, తాగునీటి సదుపాయం, విద్యుత్, ఫ్యాన్లు, శుభ్రత వంటి మౌలిక వసతులను పరిశీలించారు. ప్రతి విద్యార్థికి సరైన దూరం పాటిస్తూ కూర్చునేలా చర్యలు తీసుకోవాలని, పరీక్ష సమయంలో ఎటువంటి అంతరాయాలు లేకుండా అన్ని ఏర్పాట్లు సమర్థంగా ఉండాలని అధికారులకు సూచించారు. పరీక్షా కేంద్రంలో ప్రశ్నపత్రాల పంపిణీ, సమాధాన పత్రాల సేకరణ, భద్రపరిచే విధానం వంటి అంశాలను పరిశీలించి, పరీక్షల నిర్వహణలో పూర్తి పారదర్శకత, నిష్పక్షపాతత పాటించాలని అధికారులను ఆదేశించారు.ఎటువంటి అవకతవకలు చోటుచేసుకోకుండా కట్టుదిట్టమైన పర్యవేక్షణ ఉండాలని, మాల్ ప్రాక్టీస్‌కు అవకాశం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. పరీక్షా కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న ఇన్విజిలేటర్లు, సిబ్బంది తమ బాధ్యతలను నిబద్ధతతో నిర్వహించాలని, విద్యార్థులకు అవసరమైన మార్గదర్శకత్వం అందిస్తూ సహాయకరంగా వ్యవహరించాలని తెలిపారు. ప్రత్యేకంగా విద్యార్థులు ఒత్తిడికి లోనవకుండా, ఆత్మవిశ్వాసంతో ప్రశాంతంగా పరీక్షలు రాసేలా ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని సూచించారు.

# అబద్దపు ప్రచారం చేస్తున్న వైకాపా నేతలు

విజయవాడ ,మావిగన్ అంటే తెలుగు అర్థం వైసీపీ నాయకులు చెప్పగలరా. అమరావతి నిర్మాణానికి లక్షల కోట్లు ఖర్చవుతుందని, 'మావిగన్'కు అసలు ఖర్చే ఉండదని వైసీపీ సోషల్ మీడియా చేస్తున్న అబద్ద ప్రచారం అని రాష్ట్ర సామాజిక సంక్షేమ బోర్డు చైర్మన్ బాలకోటయ్య కొట్టిపారేసారు. జగన్మోహన్ రెడ్డి మూడు రాజధానుల ప్రతిపాదన "సగం పిచ్చి" అయితే, 'మావిగాన్' అనేది "పూర్తి పిచ్చి" కి సంకేతం. అమరావతి అంటే సిఆర్డిఏ పరిధి మొత్తం. అమరావతి అంటే 29 గ్రామాలు మాత్రమే కాదు. సి ఆర్ డి ఏ హద్దులు ముందు జగన్మోహన్ రెడ్డి తెలుసుకోవాలి. విజయవాడ రైల్వే స్టేషన్ (1888), గన్నవరం విమానాశ్రయం (1940), విజయవాడ బస్ స్టేషన్ (1990)లో నిర్మాణం జరిగాయి. బ్రిటీష్ కాలంలో జరిగిన నిర్మాణాలను కూడా జగన్ తన ఖాతాలో వేసుకుని మాట్లాడుతున్నాడు . అమరావతి రాజధానిగా రాష్ట్రపతి, కేంద్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చారు. రాష్ట్రపతి ఆమోదం పొందిన రాజముద్ర అమరావతి రాజధాని. దానిని మార్చటం జగన్ వల్ల కాదు. మావిగన్ ఏ భాష ముందుగా వైసిపి నాయకులు చెప్పి మాట్లాడాలి. మచిలీపట్నం వంటి సముద్ర తీర ప్రాంతాల్లో , తుఫాను ప్రభావితం ప్రాంతాలలో రాజధాని పెట్టడం సాధ్యపడదు . 1977 దివిసీమ తుఫాను వంటి చేదు అనుభవాలు జగన్ ముందు తెలుసుకోవాలి. మచిలీపట్నంలో రాజధాని పెట్టాలి అంటున్న జగన్ గానీ, మాజీ మంత్రి పేర్ని నాని కానీ ఒక ఎకరం భూమి మచిలీపట్నంలో సేకరించగలరా?? అమరావతికి 3.6 లక్షల కోట్లు ఖర్చవుతుందనేది తప్పుడు ప్రచారం . ఇప్పటివరకు 54 వేల కోట్లకు మాత్రమే టెండర్లు పిలిస్తే సుమారు 50 వేల కోట్లతో పనులు జరుగుతున్నాయి. గత వైసిపి ప్రభుత్వం 3.30 లక్షల కోట్లు అప్పు చేసింది. నవరత్నాలకు 2.70 లక్షల కోట్లు ఖర్చు చేస్తే, మిగిలిన నిధుల లెక్క వైసిపి సజ్జల రామకృష్ణారెడ్డి చెప్పాలి . అమరావతి కేవలం 29 గ్రామాలకు సంబంధించింది కాదు. ఇది 1.10 కోట్ల జనాభా ఉన్న విజయవాడ-గుంటూరు ప్రాంత అభివృద్ధికి సంబంధించిన ప్రాంతం . రాష్ట్ర ఆర్థిక వృద్ధికి "అక్షయ పాత్ర" అమరావతి ప్రాంతం . రాజధాని కోసం భూములిచ్చిన రైతులకు ఎలాంటి కష్టం కలగకుండా చంద్రబాబు ప్రభుత్వం చూస్తుంది . వైసీపీ నాయకుల, వైసీపీ సోషల్ మీడియా తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని అన్నారు.

# శ్రీ గోవిందరాజస్వామివారి ఆలయంలో శ్రీ భాష్యకార్ల ఉత్సవం ప్రారంభం

తిరుపతి ,శ్రీ గోవిందరాజస్వామివారి ఆలయంలో శ్రీ భాష్యకార్ల (శ్రీ రామానుజాచార్యులు) ఉత్సవాలు సోమవారం భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా ఏప్రిల్ 21న భోగి తేరు, ఏప్రిల్ 22న సాత్తుమొర, ఏప్రిల్ 23న గంధపొడి ఉత్సవం నిర్వహించనున్నారు.ఇందులో భాగంగా ప్రతిరోజు ఉదయం భాష్యకార్ల వారికి బంగారు తిరుచ్చిపై ఆలయ నాలుగు మాడ వీధుల్లో, సాయంత్రం పెద్ద వీధి ఉత్సవం వైభవంగా చేపడుతారు. అదేవిధంగా ప్రతిరోజు దివ్యప్రబంధ సేవాకాలం, సాత్తుమొర, ఆస్థానం నిర్వహిస్తారు.ఈ కార్యక్రమంలో ప్రధానార్చకులు శ్రీనివాస దీక్షితులు, ఆలయ డెప్యూటీ ఈవో వి.ఆర్. శాంతి, ఏఈవో ఏబీ నారాయణ చౌదరి, సూపరింటెండెంట్ చిరంజీవి, టెంపుల్ ఇన్స్పెక్టర్ ధనుంజయ, తదితరులు పాల్గొన్నారు.లగేజీ కౌంటర్ లో భక్తుల నుండి డబ్బులు వసూలు చేసిన వ్యక్తి విధుల నుండి తొలగింపుతిరుమలలోని లగేజీ సెంటర్ లో నరసింహారెడ్డి అనే వ్యక్తి భక్తుల నుండి డబ్బులు వసూలు చేసినట్లు టీటీడీ దృష్టికి వచ్చింది.సదరు ఔట్ సోర్సింగ్ ఉద్యోగిని విధుల నుండి తొలగించడం జరిగింది.టీటీడీ లగేజీ డిపాజిట్ సేవలను పూర్తిగా ఉచితంగా అందిస్తోంది. భక్తులెవ్వరూ తమ లగేజీ కోసం డబ్బులు చెల్లించాల్సిన అవసరం లేదని టీటీడీ తెలియజేస్తోంది.నిబంధనలను అతిక్రమించి ఎవరైనా డబ్బులు వసూలు చేస్తే విజిలెన్స్ కంట్రోల్ నెంబర్ : 9866898630 కు ఫిర్యాదు చేయాల్సిందిగా భక్తులకు విజ్ఞప్తి చేయడమైనది.

# చలివేంద్రం ప్రారంభించిన ఉమ్మడి కడప జిల్లా డీసీసీ బ్యాంక్ చైర్మన్ మంచూరు

బద్వేలు ,బద్వేలు ఆర్టీసీ బస్టాండ్ ఆవరణంలో ఆదివారం రాత్రి వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకొని ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు ఊరిబిండి మహేష్ రెడ్డి, పరిటాల వెంకట సుబ్బయ్య (ఆర్య వైశ్య కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్), దేవిరెడ్డి తులసి రెడ్డి ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేయబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఉమ్మడి కడప జిల్లా డీసీసీ బ్యాంక్ చైర్మన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి చలివేంద్రాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇలాంటి సేవా కార్యక్రమాలు సమాజానికి ఎంతో ఉపయోగకరమని, ప్రజలకు ఉపశమనం కలిగించే చర్యలను మరింతగా ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని తెలిపారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ బద్వేలు నియోజకవర్గం నాయకులు డాక్టర్ రాజశేఖర్ రాంబాబు పాలకొలను రాజశేఖర్ రెడ్డి జహంగీర్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# తిరుచానూరు పోలీస్ స్టేషన్ వద్ద ఉద్రిక్తత

తిరుపతి,తిరుచానూరు పోలీసు స్టేషన్ ముందు సోమవారం నాడు ఉద్రిక్తత నెలకొంది. పద్మావతి అమ్మవారు ఆలయం వాహన బేరర్లపై దాడి కేసులో 19 మందిపై కేసు నమోదు చేసారు. అయితే, తమ వారిపై అక్రమంగా పోలీసులు కేసులు నమోదు చేశారంటూ మహిళలు నిరసనకు దిగారు. పోలీసు స్టేషన్ ఎదుట రోడ్డుపై బైఠాయించిన వైనం. కేవలం రాజకీయ కక్షలతోనే తమవారిని వేధిస్తున్నారంటూ మండిపడ్డారు. ఎమ్మెల్యే డౌన్ డౌన్.. ఎస్పీ డౌన్ డౌను అంటూ నినాదాలు చేసారు. కక్షపూరితంగానే తమ వారిపై కేసులు నమోదు చేశారంటూ ఆగ్రహం వ్యక్తం చేసారు. ఎమ్మెల్యే నాని ఆదేశాలతోనే అక్రమంగా అరెస్టులు అని ఆరోపించారు. ముందుగా దాడి చేసిన వారిపై ఎందుకు కేసు నమోదు చేయలేదంటూ పోలీసులను నిలదీసారు. ఫిర్యాదు చేసేందుకు వచ్చిన వారినే అరెస్టు చేయడం ఏమిటంటూ ప్రశ్నించారు. వాహనాల రాకపోకలకు అడ్డంగా బైఠాయించి, పోలీసుల తీరుకు వ్యతిరేకంగా నినాదాలు చేసారుఏ.


# అద్దం పగిలితే ఏంటి.. హెల్మెట్ పెట్టుకుని నడుపుతాం.. ప్రైవేటు ట్రావెల్స్ బస్సు డ్రైవర్ నిర్లక్ష్య సమాధానం!

బస్సు ప్రమాదాలు పెరుగుతున్నప్పటికీ ప్రైవేటు ట్రావెల్స్ నిర్వాహకుల తీరు మాత్రం మారడం లేదు. ప్రయాణికుల ప్రాణాల పట్ల తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. దానికి ప్రకాశం జిల్లా మార్కాపురంలో ఓ ప్రైవేటు ట్రావెల్స్ డ్రైవర్ తీరే దానికి ఉదాహరణగా చెప్పొచ్చు. అద్దం పగిలిన బస్సు నడపడమే కాకుండా.. ఇదేంటని ప్రయాణికులు ప్రశ్నిస్తే వారికి నిర్లక్ష్యపు సమాధానమిచ్చాడు. దానికి సంబంధించిన వీడియో ఇప్పుడు సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది.శ్రీలక్ష్మీనరసింహ ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ఆదివారం రాత్రి 9.45గంటలకు మార్కాపురం నుంచి



బెంగళూరుకు వెళ్లాల్సి ఉంది. అయితే బస్సు మార్కాపురం కోర్టు కూడలికి వచ్చిన తర్వాత 36 మంది ప్రయాణికులు దాని వద్దకు చేరుకున్నారు. ఆ సమయంలోనే బస్సు ముందు అద్దం పగిలిపోయి ఉందని ప్రయాణికులు గుర్తించారు. అద్దం లేకుండా ఎలా వెళ్తారని డ్రైవర్లు మస్తాన్, రసూల్‌ను ప్రయాణికులు ప్రశ్నించారు.అందుకు ప్రైవేటు బస్సు డ్రైవర్లు నిర్లక్ష్యంతో అహంకారంగా సమాధానమిచ్చారు. అద్దం పగిలితేనేం? హెల్మెట్ పెట్టుకుని బస్సును నడుపుతామని చెప్పారు. దీంతో ఆగ్రహానికి గురైన ప్రయాణికులు డ్రైవర్‌తో వాదనకు దిగారు. ఇంతలో డ్రైవర్ బస్సు స్టార్ట్ చేయడంతో ఇంజిన్ నుంచి శబ్దం తేడాగా వచ్చింది. దీంతో ప్ రయాణికులు వేరే బస్సు ఏర్పాటు చేయాలని మార్కాపురం పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో పోలీసులు విచారణ జరపగా.. రెండు రోజుల క్రితమే ఆ బస్సుకు యాక్సిడెంట్ అయ్యిందని తెలిసింది. దీంతో ఆ బస్సును సీజ్ చేశారు.

# పట్టణ ప్రాంతాల్లో ఆస్తి పన్ను చెల్లింపుదారులకు ప్రభుత్వం గుడ్‌న్యూస్




అమరావతి, ఏప్రిల్ 13: పట్టణ ప్రాంతాల్లో ఆస్తి పన్ను బకాయిలపై ఆస్తిపన్ను బకాయిలపై ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 31 మార్చి 2026 నాటికి ఉన్న బకాయిలపై వడ్డీలో 50 శాతం రాయితీ ఇవ్వాలని నిర్ణయించింది. ఈ రాయితీని పొందాలంటే బకాయి మొత్తం(ప్రిన్సిపల్) పూర్తిగా చెల్లించి, మిగిలిన 50 శాతం వడ్డీని ఒకేసారి చెల్లించాల్సి ఉంటుంది. ఇది ఆస్తి పన్ను చెల్లించని వారికి గోల్డెన్ ఛాన్స్ అని చెప్పుకోవాలి.సీడీఎమ్ఏ కమిషనర్ సంపత్ కుమార్ సూచనల మేరకు.. ఈ రాయితీ అమలు ఏప్రిల్ 30, 2026 వరకు మాత్రమే ఉండనుంది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బకాయిలపై మాత్రమే 50 శాతం వడ్డీ రాయితీ వర్తిస్తుంది. పట్టణ ప్రజలు ఈ అవకాశాన్ని వెంటనే వినియోగించుకోవాలని అధికారులు విజ్ఞప్తి చేశారు. 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆస్తి పన్నును ఏప్రిల్ 30, 2026 లోపు ముందస్తుగా మొత్తం చెల్లించేవారికి 5 శాతం అదనపు రాయితీ కూడా లభిస్తుంది. మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లలోనూ రాయితీ అమలులో ఉండనుంది. పట్టణాభివృద్ధికి పన్నులు చెల్లించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు. ప్రజలు ఆలస్యం చేయకుండా వెంటనే సమీప మున్సిపల్ కార్యాలయం, ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా ఆస్తి పన్ను చెల్లించి ఈ సువర్ణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచించారు.

# జగన్, సజ్జల ప్రజల జీవితాలతో చెలగాటమాడారు: హనుమంతరావు

విజయవాడ, ఏప్రిల్ 13: మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి, వైసీపీ నేత సజ్జల రామకృష్ణారెడ్డిపై టీడీపీ నేత హనుమంతరావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. గత రెండు రోజులుగా సజ్జల అమరావతిపై అవాకులు చవాకులు పేలుతున్నారని విమర్శించారు. రాష్ట్రంలో జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో రాజధాని అమరావతి నిర్మాణంలో ఒక్క ఇటుక రాయి అయినా వేశారా అని ప్రశ్నించారు. చంద్రబాబు సారథ్యంలో ఇప్పుడు రాజధాని



అమరావతి శరవేగంగా అభివృద్ధి చెందుతోందని తెలిపారు. ఇది చూసి ఓర్వలేక రాజధాని నిర్మాణంలో అవినీతి జరిగిపోతోందని బోగస్ ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు.రాష్ట్ర ప్రజలు జగన్‌ను నమ్మే పరిస్థితిలో లేరని టీడీపీ నేత అన్నారు. మూడు ముక్కలాట ఆడి రాష్ట్రాన్ని సర్వనాశనం చేసింది జగనే అంటూ వ్యాఖ్యానించారు. ప్రజావేదికను ధ్వంసం చేసి విధ్వంసకర పాలనకు జగన్ నాడే శ్రీకారం చుట్టారని మండిపడ్డారు. జగన్, సజ్జల రాష్ట్ర ప్రజల జీవితాలతో చెలగాటమాడారన్నారు. ప్రజలు 11తో బుద్ధి చెప్పినా ఇంకా డ్రామాలు ఆడుతున్నారన్నారు. హత్యా రాజకీయాలు, దూషణలను ప్రోత్సహించే జగన్‌కు ప్రజలు మళ్లీ బుద్ధి చెప్పడం ఖాయమని టీడీపీ నేత హనుమంతరావు హెచ్చరించారు.

# విశాఖ - సికింద్రాబాద్ వందే భారత్ కు మరో హాల్ట్, ఆ రి ఎక్స్‌ప్రెస్ లు ఇక రెగ్యులర్ గా..!!

రైల్వే శాఖ మరో కీలక నిర్ణయం తీసుకుంది. తెలుగు రాష్ట్రాల్లో వందేభారత్ రైళ్లకు ఆదరణ పెరుగు తున్న వేళ.. మరింత విస్తరించాలని నిర్ణయించింది. అందులో భాగంగా ప్రస్తుతం విశాఖ నుంచి సికింద్రాబాద్ వరుకు నడుస్తున్న వందేభారత్ కు మరో ప్రధాన స్టేషన్ లో హాల్టింగ్ సౌకర్యాన్ని కల్పించింది. అదే విధంగా ప్రస్తుతం స్పెషల్ రైళ్లుగా నడుస్తున్న తొమ్మది ఎక్స్ ప్రెస్ లను రెగ్యులర్ రైళ్లుగా మార్పు చేసారు. ప్రయాణీకుల నుంచి వస్తున్న ఆదరణ మేరకు ఈ నిర్ణయాల అమలుకు సిద్దమయ్యారు. రైల్వే స్టేషన్‌లో కూడా ఆగనుంది. ఈ విషయాన్ని కేంద్రమంత్రి భూపతిరాజు వెల్లడించారు. స్థానికుల నుంచి వచ్చిన వినతులను రైల్వేశాఖ దృష్టికి భూపతిరాజు తీసుకెళ్లటంతో.. రైల్వేశాఖ ఈ మేరకు సానుకూలంగా స్పందించింది. దీంతో తాడేపల్లిగూడెం చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలకు వందే భారత్ సౌకర్యం అందుబాటులోకి రానుంది. తాడేపల్లిగూడెం కు వందేభారత్ రాకపోకల వేళలను రైల్వే శాఖ అధికారికంగా ప్రకటించనుంది. అదే విధంగా రైల్వేకు సంబంధించి కీలక అంశాలను మంత్రి భూపతిరాజు వెల్లడించారు. గతంలో ఉన్న 9 ప్రత్యేక రైళ్లను ఇప్పుడు రెగ్యులర్ సర్వీసులుగా మార్చినట్లు ప్రకటించారు. సికింద్రాబాద్- అనకా పల్లి (17043/44), చర్లపల్లి - భువనేశ్వర్ న్యూ ఎక్స్‌ప్రెస్ (17067/68) రైళ్లు ఆకివీడు, భీమవరం టౌన్, తణుకు స్టేషన్లలో ఆగుతాయని తెలిపారు. రెగ్యులర్ ఎక్స్ ప్రెస్ లుగా తొమ్మది స్పెషల్ ట్రైన్స్ అదే విధంగా చర్లపల్లి - అనకాపల్లి (17045/46), చర్లపల్లి - అ నకాపల్లి (17053/54), కాకినాడ టౌన్ - హిసార్ ఎక్స్‌ప్రెస్ (17 295/96) రైళ్లు తాడేపల్లిగూడెంలో నిలుపుదల సౌకర్యం కలిగి ఉన్నాయన్నారు. నియోజకవర్గంలోని ఇతర ప్రాంతాల ప్రయాణికుల కోసం తిరుపతి - నరసాపురం (17427/28) రైలు ఆకివీడు, భీమవరం టౌన్, భీమవరం, పాలకొల్లు, నరసాపురం స్టేషన్లలో ఆగుతుందన్నారు. కాకినాడ టౌన్ - లింగంపల్లి (12775/76), కాకినాడ టౌన్ - మైసూర్ ఎక్స్‌ప్రెస్ (17289/90) రైళ్లు తణుకు, భీమవరం టౌన్, ఆకివీడులో నిలుస్తాయని తెలిపారు.

# శ్రీవారి జూలై నెల టికెట్ల షెడ్యూల్ విడుదల : టీటీడీ



హైదరాబాద్,ఏప్రిల్ 12 : తిరుమల శ్రీవారి ఆర్జిత సేవా టికెట్లు జూలై నెల కోటాను ఈనెల 18న ఉదయం 10గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేయనున్నట్టు టీటీడీ తెలిపింది. ఈ సేవా టికెట్లు ఎలక్ట్రానిక్ డిప్ కోసం 20న ఉదయం 10 గంటల వరకు నమోదు చేసుకోవచ్చని పేర్కొన్నది. టికెట్లు పొందిన వారు 20 నుంచి 22మధ్యా హ్నం 12గంటల్లోపు నగదు చెల్లిస్తే టికెట్లు మంజూరవుతాయని వివరించింది.కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవా టికెట్లు 21న ఉదయం 10గంటల కు విడుదలవుతాయని తెలిపింది. వర్చువల్ సేవల దర్శనస్లాట్లను 21న మధ్యాహ్నం 3గంటలకు, అంగప్రదక్షిణ టోకెన్ల కోటాను 23న ఉదయం 10గంటలకు, శ్రీవాణి ట్రస్టు దర్శన టికెట్ల కోటా 23న 11గంటలకు విడుదలవుతాయని పే ర్కొన్నది. ప్రత్యేక ప్రవేశదర్శన కోటాను 24న 10గంటలకు విడుదల చేస్తామని తెలిపింది.

# డ్రగ్స్‌పై పోలీసుల కొరడా.. మత్తు పదార్థాలపై స్పెషల్ డ్రైవ్



ఎన్టీఆర్ జిల్లా, ఏప్రిల్ 12 : జగ్గయ్యపేట నియోజకవర్గంలో మత్తు పదార్థాల నిర్మూలన ధ్యేయంగా పోలీసులు చేపట్టిన ప్రత్యేక తనిఖీల్లో సంచలన విషయాలు వెలుగుచూశాయి. 'డ్రగ్స్ పై దండయాత్ర-2' కార్యక్రమంలో భాగంగా పోలీసులు తనిఖీలు నిర్వహించారు.జగ్గయ్యపేట సర్కిల్ పరిధిలోని జగ్గయ్యపేట, చిల్లకల్లు, వత్సవాయి, పెనుగంచిప్రోలు పోలీస్ స్టేషన్ల పరిధిలో ఈ తనిఖీలు చేపట్టారు. అనుమానితులుగా గుర్తించిన 112 మందికి యూరిన్ టెస్టులు నిర్వహించగా, అందులో 30 మందికి పాజిటివ్ అని తేలింది. అంటే వీరు డ్రగ్స్ లేదా గంజాయి వంటి మత్తు పదార్థాలను వాడుతున్నట్లు నిర్ధారణ అయ్యింది.'డ్రగ్స్ పై దండయాత్ర-2' కార్యక్రమంలో ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్ (తాతయ్య), కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ నెట్టెం రఘురాం, విజయవాడ రూరల్ డీసీపీ లక్ష్మీనారాయణ, జగ్గయ్యపేట సీఐ, ఎస్ఐలు పాల్గొన్నారు.మత్తు పదార్థాలకు బానిసలైన వారిని కేవలం నేరస్థులుగా చూడకుండా, వారిని ఆ రొంపి నుంచి బయటకు తీసుకువచ్చేందుకు పోలీసులు మానవీయ కోణంలో చర్యలు తీసుకుంటున్నారు.డ్రగ్స్ పాజిటివ్ అని తేలిన 30 మందిని కౌన్సెలింగ్ నిమిత్తం విజయవాడలోని రిహాబిలిటేషన్ సెంటర్‌కు తరలించనున్నారు. యువత డ్రగ్స్, గంజాయి, మద్యపానానికి దూరంగా ఉండాలని, మత్తు పదార్థాల వల్ల జీవితాలు ఎలా చిన్నాభిన్నం అవుతాయో ఈ సందర్భంగా పోలీసులు వివరించారు. నియోజకవర్గంలో గంజాయి, డ్రగ్స్ విక్రయించే ముఠాలపై కఠినంగా వ్యవహరిస్తామని, అక్రమ రవాణాను అరికట్టేందుకు నిరంతర నిఘా ఉంటుందని పోలీసులు హెచ్చరించారు

# ఇరాన్‌పై యుద్ధాన్ని ఆపాలి

అరసవల్లి, ఏప్రిల్ 13 ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్ చేస్తున్న యుద్ధాన్ని తక్షణమే ఆపాలని వక్తలు డిమాండ్‌చేశారు. ఆదివారం శ్రీకాకుళంలోని ఎన్జీవో హోమ్‌లో ఇరాన్‌పై యుద్ధాన్ని ఖండిస్తూ, ప్రపంచ శాంతిని కోరుతూ జిల్లా పౌరహక్కుల సంఘం ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మానవ హక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు కేవీ జగన్నాథరావు, అరుణోదయ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నశెట్టి రాజశేఖర్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ అమ్మన్నాయుడు తదితరులు మాట్లాడుతూ మానవజాతి మనుగడకు ప్రమాదకరంగా పరిణమించిన యు ద్ధాన్ని ఖండించారు. నాగరిక సమాజంలో ఆధిపత్యం కోసం, సహజ వనరుల దోపిడీకి యుద్ధాలు చేస్తున్న అమెరికా సామ్రాజ్యవాదాన్ని వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మిస్కా కృష్ణయ్య, మద్దిల వినోద్‌కుమార్, రామారావు, వెంకటరావు, మహిళా సంఘాల నాయకులు నాగమణి, భానుమతి, గీతారాణి, జోగారావు, దానయ్య, వైకుంఠరావు పాల్గొన్నారు.



## బార్ అసోసియేషన్‌కు మంత్రి ఫరూక్ భరోసా--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఏప్రిల్ 13:నంద్యాల బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్‌ను సోమవారం నంద్యాల క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా నంద్యాల టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్‌ను కూడా వారు కలుసుకున్నారు.ఇటీవల జరిగిన ఎన్నికల్లో అధ్యక్షుడిగా ఎన్నికైన గోపిశెట్టి వెంకట నాగ ప్రసాద్ (జీవీఎన్ ప్రసాద్)తో పాటు నూతన కార్యవర్గ సభ్యులకు మంత్రి ఫరూక్ శుభాకాంక్షలు తెలిపారు. న్యాయవాదుల సంక్షేమం, బార్ అసోసియేషన్ అభివృద్ధికి ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు.మంత్రి ఫరూక్ మాట్లాడుతూ న్యాయవాదుల పాత్ర సమాజంలో కీలకమని, సామాన్యులకు న్యాయం అందించే బాధ్యతను సమర్థంగా నిర్వహించాలని సూచించారు. న్యాయవాదుల సంక్షేమంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని తెలిపారు. నంద్యాల బార్ అసోసియేషన్‌కు అవసరమైన మౌలిక సదుపాయాలు, కోర్టు ప్రాంగణ సమస్యల పరిష్కారం, న్యాయవాదుల భవన నిర్మాణానికి తన వంతు సహకారం అందిస్తామని పేర్కొన్నారు. న్యాయవ్యవస్థ బలోపేతానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు న్యాయవాదులు సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జీవీఎన్ ప్రసాద్, జనరల్ సెక్రటరీ కె. గౌరీశంకర్, స్పోర్ట్స్ సెక్రటరీ పుసులూరు ప్రసాదరెడ్డి, లేడీ ప్రతినిధి శ్రీదేవి, ఏపీపీ రాజేశ్వరరెడ్డి, సీనియర్ న్యాయవాది జి. జయకృష్ణ, ఎస్ఐ ఖలీల్, అరిగెల రఘు ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారి ప్రాణాలపై జాగ్రత్త-

**సీఐ యుగంధర్ హెచ్చరిక--**



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఏప్రిల్ 13:వేసవికాలం సెలవుల నేపథ్యంలో చిన్నారుల భద్రతపై తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని ఆళ్లగడ్డ పట్టణ సీఐ యుగంధర్ సూచించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ, చెరువులు, బావుల వద్ద ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని, లోతు తెలియకుండా ఈతకు దిగుతున్న చిన్నారులు ప్రాణాపాయ పరిస్థితులను ఎదుర్కొంటున్నారని తెలిపారు.ప్రత్యేకంగా పల్లె ప్రాంతాల్లో నిర్లక్ష్యంగా ఉన్న బావులు, చెరువులు చిన్నారులకు ప్రమాదకరంగా మారుతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. పిల్లలు స్నేహితులతో కలిసి ఈతకు వెళ్లకుండా తల్లిదండ్రులు కట్టడి చేయాలని, వారి కదలికలపై నిరంతరం పర్యవేక్షణ అవసరమని సూచించారు.విద్యార్థులు ఇంటి పరిసరాల్లోనే సురక్షితంగా ఆడుకునేలా తల్లిదండ్రులు చర్యలు తీసుకోవాలని, అనుమానాస్పద పరిస్థితులు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సీఐ యుగంధర్ విజ్ఞప్తి చేశారు.చిన్నారుల ప్రాణ భద్రత ప్రతి కుటుంబం బాధ్యతగా భావించి, ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటేనే ప్రమాదాలను నివారించవచ్చని ఆయన స్పష్టం చేశారు.

## రియల్ ఎస్టేట్ ప్రారంభోత్సవం వివాదం--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఏప్రిల్ 13:నంద్యాల పట్టణంలోని బాలాజీ కాంప్లెక్స్‌లో జరిగిన ప్రైవేట్ రియల్ ఎస్టేట్ కార్యాలయ ప్రారంభోత్సవం జిల్లాలో వివాదానికి దారితీసింది. ఈ కార్యక్రమానికి ఆర్డీవో, మున్సిపల్ కమిషనర్ సహా పలువురు ప్రభుత్వ అధికారులు హాజరుకావడంపై సిపిఐ జిల్లా కార్యదర్శి ఎన్. రంగనాయుడు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.ప్రైవేట్ కార్యక్రమాలకు ప్రభుత్వ అధికారులు హాజరుకావడం సర్వీస్ నిబంధనలకు విరుద్ధమని ఆయన అన్నారు. సాధారణ ప్రజలకు అందుబాటులో ఉండాల్సిన అధికారులు ఇటువంటి కార్యక్రమాల్లో పాల్గొనడం తగదని విమర్శించారు.రియల్ ఎస్టేట్ వ్యాపారానికి అధికారిక మద్దతు ఉన్నట్లుగా ప్రజల్లో అనుమానాలు కలుగుతున్నాయని పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై జిల్లా యంత్రాంగం వెంటనే దర్యాప్తు జరిపించి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.





# ప్రజలకు జవాబుదారీగా పనిచేయాలి--

**100 శాతం ఫిర్యాదుల పరిష్కారం తప్పనిసరి--**

**నిర్లక్ష్యంపై కఠిన చర్యలు--**

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఏప్రిల్ 13:-జిల్లాలో ప్రజా సమస్యలను వేగంగా పరిష్కరించి ప్రజలకు జవాబుదారీగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. జాయింట్ కలెక్టర్ కార్తీక్, డిఆర్ఓ రాము నాయక్ తదితరులు




పాల్గొన్నారు.గతంలో పరిష్కరించిన ఫిర్యాదులు మళ్లీ రీఓపెన్ అవుతున్నాయని పేర్కొంటూ, అలాంటి కేసులను ప్రాధాన్యతతో పరిష్కరించాలని సూచించారు. ప్రతి వారం సమీక్షకు ముందు 100 శాతం ఫిర్యాదులు పరిష్కరించాలన్నారు. ఫిర్యాదుదారులతో నేరుగా మాట్లాడి నివేదికలు పంపాలని తెలిపారు.విధుల్లో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించిన కలెక్టర్, బయోమెట్రిక్ హాజరు తప్పనిసరి చేయాలని ఆదేశించారు. సర్ప్రైజ్ తనిఖీలు, షోకాజ్ నోటీసులు జారీ చేస్తామని తెలిపారు. గ్రామ స్థాయిలోనే సమస్యలు పరిష్కరించాలని సచివాలయ సిబ్బందికి సూచించారు.జల్ జీవన్ మిషన్, గ్రామ అభివృద్ధి పనులు, విద్యుత్ సదుపాయాలపై వేగం పెంచాలని ఆదేశించారు. ప్రతి సోమవారం గ్రీవెన్స్ డేకు అధిక సంఖ్యలో ప్రజలు వస్తున్నందున క్షేత్రస్థాయిలో సమస్యలు పరిష్కరించాలని స్పష్టం చేశారు.

## గోనెగండ్ల మండల కేంద్రంలో ప్రజా సమస్యలు పరిష్కరించాలి...

**- గోనెగండ్ల సమస్యలపై ప్రభుత్వ వైఫల్యం...**

**- రైతులను ముంచుతున్న గాజులదిన్నె నిర్లక్ష్యం...**

విభారే న్యూస్ ఏప్రిల్ 13 కర్నూలు జిల్లా ప్రతినిధి..గోనెగండ్లను పట్టించుకోని ప్రభుత్వం పై కాంగ్రెస్ ధ్వజం.జల జీవన్, రోడ్లు, ఆరోగ్యం అన్ని రంగాల్లో ప్రభుత్వ విఫలం.డిసిసి అధ్యక్షులు క్రాంతి నాయుడు బోయ.గోనెగండ్ల మండల కేంద్రంలో ప్రజలకు సంబంధించి అన్ని సమస్యలను పరిష్కరించాలని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు క్రాంతి నాయుడు బోయ డిమాండ్ చేశారు. సోమవారం గోనెగండ్ల మండల కేంద్రంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు ముల్లా ఖాసిం వలి అధ్యక్షతన, కర్నూలు జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో గోనెగండ్ల మండలంలోని ప్రజలు ఎదుర్కొంటున్న కీలక సమస్యలపై మండల రెవెన్యూ అధికారి (ఎమ్మార్వో) కి వినతిపత్రం సమర్పించారు. క్రాంతి నాయుడు మాట్లాడుతూ మండలంలో గాజులదిన్నె ప్రాజెక్ట్ పనులలో నిర్లక్ష్యం వల్ల రైతులు నష్టపోతుండటం, ముంపు ప్రాంతాలలో భూసేకరణ జరగకపోవడం వల్ల తీవ్ర అన్యాయం జరుగుతోందని ప్రస్తావించారు. అలాగే గ్రామీణ ప్రజలు ఆరోగ్యం, రవాణా, తాగునీరు, మౌలిక వసతుల లోపంతో ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. ఈ సందర్భంగా ప్రధానంగా గాజులదిన్నె ప్రాజెక్ట్ పూర్తి చేసి ప్రభావిత రైతులకు నష్టపరిహారం చెల్లించాలి. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పడకల సంఖ్య పెంచాలి. కొత్త ఆర్‌టీసీ బస్టాండ్ నిర్మించి, అన్ని బస్సు సర్వీసులు ఆపేలా చర్యలు తీసుకోవాలి. గంజళ్ళ రోడ్ నుంచి స్టేట్ బ్యాంక్ వరకు ట్రాఫిక్ నియంత్రణ, రోడ్డు విస్తరణ చేపట్టాలి. జల జీవన్ మిషన్ పనులు పూర్తి చేసి ఉచిత కొలాయి కనెక్షన్లు ఇవ్వాలి. సీసీ రోడ్లు, డ్రైనేజీలు, వీధి దీపాలు



ఏర్పాటు చేయాలి. స్మశాన వాటికలకు కాంపౌండ్ వాల్ నిర్మించి మౌలిక వసతులు కల్పించాలి. అంగన్వాడి కేంద్రాన్ని పునరుద్ధరించి మహిళలు, పిల్లలకు సేవలు అందించాలి. ముస్లిం షాదీ ఖానాను పునర్నిర్మించాలి. అంబేద్కర్ విగ్రహ స్థలాన్ని కేటాయించాలని డిమాండ్ చేయడమైనది. ప్రజల దైనందిన జీవితంపై తీవ్ర ప్రభావం చూపుతున్న ఈ సమస్యలను తక్షణమే పరిష్కరించకపోతే, కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని క్రాంతి నాయుడు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మిగనూరు నియోజకవర్గ కోఆర్డినేటర్ ఎం కాశీం వలి, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఏ సూర్య ప్రకాష్ రెడ్డి, జిల్లా ఓబీసీ సెల్ చైర్మన్ డివి సాంబశివుడు, జిల్లా ఎన్ఎస్యుఐ జిల్లా అధ్యక్షులు వీరేశ్ యాదవ్, ఆదోని కాంగ్రెస్ నాయకులు దిలీప్ డోక, శ్రీనిధి రాయల్, మంత్రాలయం నాయకులు ఆనందరాజు, ముస్తఫా షబ్బీర్ దేశాయ్, అడ్వకేట్ ఇర్షాద్, రంగన్న రసూల్ , గోనెగండ్ల కాంగ్రెస్ నాయకులు మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ కంసాలి రాజశేఖర్ ఆచారి, గోనెగండ్ల టౌన్ కాంగ్రెస్ అధ్యక్షులు అచ్చు గట్ల నజీర్ ఓబీసీ మండల చైర్మన్ కే శేషాద్రి, యూత్ కాంగ్రెస్ నాయకులు ముల్లా ఒసామ, వడ్డే లక్ష్మన్న,వడ్డే రంగన్న, అచ్చు గట్ల ఫక్రుద్దీన్, బేతాళ పెద్ద భాష, పి హసన్ మొదలగువారు పాల్గొన్నారు.

## ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు వచ్చిన 112 ఫిర్యాదులను విచారణ జరిపి న్యాయం చేస్తాం..

విభారే న్యూస్ ఏప్రిల్ 13 కర్నూలు జిల్లా ప్రతినిధి..విచారణ జరిపి చట్టపరంగా న్యాయం చేస్తాం.కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్.ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమానికి 112 ఫిర్యాదులు.ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన ఫిర్యాదుల పై త్వరితగతిన స్పందించి, పరిష్కరించాలని పోలీసు అధికారులను ఆదేశించిన జిల్లా ఎస్పీ.కర్నూల్ కొత్తపేటలోని కర్నూల్ టూ టౌన్ పోలీస్ స్టేషన్ ప్రక్కన ఉన్న ఎస్పీ క్యాంపు కార్యాలయంలో కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు.జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంకు వచ్చిన ప్రజల సమస్యల వినతులను స్వీకరించి ఫిర్యాది దారులతో జిల్లా ఎస్పీ మాట్లాడి వారి యొక్క సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి ఈ రోజు మొత్తం 112 ఫిర్యాదులు



వచ్చాయి.వచ్చిన ఫిర్యాదుల్లో కొన్ని ..1)కస్టమర్ సర్వీస్ పాయింట్ , ఫ్లాట్ బుకింగ్ ల పేరుతో విజయవాడకు చెందిన ఏజెంట్ సతీష్ రెడ్డి నా క్రెడిట్ కార్డును వినియోగించి రూ.8 లక్షలు తీసుకొని మోసం చేశాడని చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని కర్నూల్, గణేష్ నగర్ చెందిన వినోద్ కుమార్ ఫిర్యాదు చేశారు.2)నేను సోలార్ పంపుసెట్ల వ్యాపారం చేస్తున్నాను. ఆదోని కి చెందిన ఒక యూట్యూబ్ ఛానల్ విలేఖరి నన్ను బెదిరించి, నేను మాట్లాడిన మాటలను ఆసరాగా చేసుకుని నన్ను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆదోని, పంజరపోల్ కు చెందిన హనుమంతప్ప ఫిర్యాదు చేశారు.3) కల్లూరు మండలం, గోకులపాడు గ్రామానికి చెందిన హోంగార్డు పుష్పగిరి నాకు హోంగార్డు ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి రూ.5 లక్షలు తీసుకొని మోసం చేశాడని కర్నూలు, చిదంబరావు స్ట్రీట్ కు చెందిన అశోకమ్మ ఫిర్యాదు చేశారు.4)ఏజెంట్ల ద్వారా పరిచయమై బెల్లం, చిప్స్ రాయలసీమ ఏరియా కు పంపుతామని చెప్పి మొత్తం రూ.30 లక్షలు తీసుకొని రూ.8 లక్షల సరుకు మాత్రమే పంపి, మిగిలిన డబ్బులు ఇవ్వకుండా లేదా, బెల్లనీ , చిప్స్ స్టాక్ పంపకుండా మోసం చేసిన (కర్ణాటక కు చెందిన ఆనంద్ దీపక్)(రాయచోటికి చెందిన కిషోర్ రెడ్డి) వారి పై చర్యలు తీసుకోవాలని న్యాయం చేయాలని కర్నూల్ కింగ్ మార్కెటింగ్ చెందిన ఆనందరావు ఫిర్యాదు చేశారు.5)ఇద్దరు వ్యక్తులు నా కారును తీసుకొని, బలవంతంగా చెక్కులు, బాండు ల పై సంతకాలు చేయించుకుని మోసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కర్నూల్, బాలాజీ నగర్ చెందిన నరసింహులు ఫిర్యాదు చేశారు.6.కర్నూల్ ఎస్బిఐ ట్రెజరీ బ్యాంకు కు వెళ్లాను . అందులో పని చేసే ఒక ఔట్సోర్సింగ్ మహిళా ఉద్యోగి నా యొక్క ఎస్ బి ఐ యోనో యాప్ ను ఇన్ స్టాల్ చేసి ఇస్తామని వ్యక్తిగత వివరాలు (ఏటిఎం, పాన్, ఓటీపీ) తీసుకుని నా ఖాతా నుంచి రూ. 3,540 మోసం చేశారని,బ్యాంక్ మేనేజర్‌ను సంప్రదిస్తే ఔట్సోర్సింగ్ ఉద్యోగిని తీసివేశామని , నా డబ్బులు నాకు ఇప్పించి న్యాయం చేయాలని కర్నూలు, చంద్రశేఖర్ నగర్ కు చెందిన రిటైర్డ్ ఫారెస్ట్ ఉద్యోగి ఆశీర్వాదం ఫిర్యాదు చేశారు.ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటి పై చట్ట ప్రకారం విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేస్తామని, సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని ఈ సందర్భంగా కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ హామీ ఇచ్చారు.

## అర్జీల పరిష్కారంలో వేగం పెంచాలి--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఏప్రిల్ 13:-ప్రజల నుంచి వచ్చే అర్జీలను సకాలంలో, నాణ్యంగా పరిష్కరించి కనీసం 95 శాతం లక్ష్యాన్ని సాధించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులకు ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆమె అర్జీలు స్వీకరించారు.అర్జీలను కేవలం ముగించడం కాకుండా సమస్య మూలాన్ని గుర్తించి శాశ్వత పరిష్కారం ఇవ్వాలని, ప్రతి అర్జీదారుడు సంతృప్తి చెందేలా పనిచేయాలని సూచించారు. పనితీరు తక్కువగా ఉన్న 10 మంది అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఆదేశించగా, మంచి పనితీరు కనబరిచిన అధికారులను అభినందించారు.పీజీఆర్ఎస్ ద్వారా 296 అర్జీలు స్వీకరించగా, వాటిని గడువులో పరిష్కరించాలని చెప్పారు. రెవెన్యూ క్లినిక్స్ ద్వారా 164 అర్జీలు స్వీకరించి భూ సమస్యలపై వేగంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.ప్రజా సమస్యల పరిష్కారంలో పారదర్శకత, వేగం తప్పనిసరి అని కలెక్టర్ స్పష్టం చేశారు.

## షార్ట్ సర్క్యూట్‌తో ఆవుల మృతి--

**రైతుకు రూ.1 లక్ష సహాయం--**



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఏప్రిల్ 13:-రుద్రవరం మండలం భూమనాయుడుపల్లి గ్రామానికి చెందిన రైతు సుధాకర్ విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా రెండు ఆవులను కోల్పోయినట్లు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి తెలిపారు.సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా బాధిత రైతుకు రూ.1 లక్ష ఆర్థిక సహాయం అందజేశారు.ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఈ ఘటనకు నేరుగా నష్టపరిహారం వర్తించకపోయినా, రైతు పరిస్థితిని పరిగణనలోకి తీసుకుని పశుసంవర్ధక శాఖ నివేదిక ఆధారంగా జిల్లా యంత్రాంగం సహాయం అందించినట్లు కలెక్టర్ తెలిపారు.ఈ సహాయాన్ని వినియోగించుకుని తిరిగి జీవనోపాధిని పునరుద్ధరించుకోవాలని రైతుకు సూచించారు.

## జల చైతన్యానికి గేయ ఆవిష్కరణ--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఏప్రిల్ 13:రాయలసీమ సాగునీటి సాధన సమితి జల ఆవశ్యకతపై ప్రజల్లో చైతన్యం పెంచేందుకు మరో ముందడుగు వేసింది. ఈ క్రమంలో "జననీ జన్మభూమిశ్చ" గేయాన్ని విద్యార్థులతో ఆవిష్కరించారు.నంద్యాలలో నిర్వహించిన కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి మాట్లాడుతూ "జలమే జీవం" అని పేర్కొంటూ త్రాగు, సాగునీటి ప్రాముఖ్యతను వివరించారు. రాయలసీమ అభివృద్ధికి నీటి వనరులు కీలకమని, యువత చైతన్యంతోనే హక్కులు సాధ్యమవుతాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఐక్యవేదిక కన్వీనర్ ఆకుమల్ల రహీం, సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కార్మిక హక్కుల కోసం ఐక్య పోరాటాలు అవసరం--

**17 నుంచి నంద్యాలలో సీఐటీయూ రాష్ట్ర మహాసభలు--**

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఏప్రిల్ 13:దేశంలో కార్మిక హక్కులు హరించుకుపోతున్నాయని, వాటి రక్షణ కోసం ఐక్య పోరాటాలు అవసరమని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సి.హెచ్. నర్సింగరావు పేర్కొన్నారు. ఈ నెల 17 నుంచి 19 వరకు నంద్యాలలో సీఐటీయూ 17వ రాష్ట్ర మహాసభలు నిర్వహించనున్నట్లు తెలిపారు.సోమవారం నంద్యాలలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కార్మిక హక్కులను దెబ్బతీసే విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలు తీవ్రతరం అవుతాయని హెచ్చరించారు. లేబర్ కోడ్ల పేరుతో కార్మికులపై భారం పెరుగుతోందని, కనీస వేతనాల పెంపు, సంక్షేమ పథకాల అమలులో నిర్లక్ష్యం కొనసాగుతోందని విమర్శించారు.పరిశ్రమల్లో స్థానికులకు ప్రాధాన్యత ఇవ్వాలని, ఈఎస్ఐ, పీఎఫ్ వంటి చట్టాలు కచ్చితంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. మహాసభల సందర్భంగా 17న భారీ ప్రదర్శన, బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమాలను విజయవంతం చేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు.




EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2, OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY, 7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190